# కదంబం

## పోరంకి దక్షిణామూర్తి

"అదుగో బుచ్చిరెడ్డిపాళెం!" అన్న దామె. తల ఎత్తి చూశాను, రెండు ఫర్లాంగుల దూరంలో దుకాణాలు కన్పిస్తున్నాయి రోడ్డుకు ఎడంపక్క ఊరు కనిపిస్తోంది ఊరి మధ్యగా, పెద్ద ఎత్తున, దేవాలయపు గాలిగోపురం కనిపిస్తోంది

"హమ్మయ్య! వచ్చేశాం సార్!" అన్నాడు రంగయ్య

రంగయ్యా, భార్యా వింజమూరు నుంచి నాతో ప్రయాణం చేస్తున్నారు మే మెక్కిన బస్సుకాస్తా, బుచ్చిరెడ్డిపాళానికి రెండు మైళ్ళ ఇవతల ఆగిపోయింది మరమ్మతు అయేవరకూ ఆలస్య మవుతుందంటే, చాలామంది ప్రయాణీకులం నడక లంకించుకున్నాం ఊరు దగ్గర పడిందని తెలియగానే నాకు ఎక్కడలేని ఓపికా వచ్చింది. వాళ్ళతోబాటు నేనూ గబగబా నడవడం ప్రారంభించాను

కనుచీకటి వేళ, 'బుచ్చి'లో అడుగు పెట్టాం. అంటే వూళ్ళో అని కాదు. బస్సుస్టాండుదగ్గిర చుట్టూ దుకాణాలూ, కాఫీ హోటళ్లూ ఉన్నాయి ఉదయగిరి వైపు పోయే బస్సు ఒకటి అప్పుడే బయలుదేరుతూ ఉంది చుట్టూ పదిహేను, ఇరవై మంది పిల్లలు చేరి, పూల మాల లమ్ముతున్నారు. ఆ బస్సు బయలుదేరింది. అయినా బస్సుతోబాటు వాళ్లూ నడుస్తూనే ఉన్నారు దండలు చేతులకి చుట్టుకుని రకరకాలవి చూపిస్తూ, అమ్ముతున్నారు కొందరు కొన్నారు కొంత మంది అక్కర్లే దంటున్నారు అయినా వీళ్లు వదలరు అమ్మ కాదంటే అయ్యానీ, అయ్య కాదంటే అమ్మనీ పేరుపేరునా పిలిచి దండలు అందిస్తున్నారు ఒక అమ్మాయి బలవంత పెడుతోంది. ఇంకొక పడుచు ఎంతతోస్తే అంతే యిమ్మంటోంది. ఇంకొక నెరజాణ, కొనవివాళ్ళని దెప్పుతోంది ఇంకో పిల్ల, "పువ్వులకాడ బేర మేందయ్యా!" అని కోప్పడుతోంది.

నాకు చాలా చిత్రంగా ఉంది. ఆంధ్ర దేశంలో మొత్తంమీద ఎన్నో ఊళ్లు తిరిగాను కాని, ఇంత అందమైన దృశ్యం ఎక్కడా చూడలేదు. ఇంత మంది పిల్లలూ, ఇన్నిరకాల పూలూ!

బస్సుల్లో యిలా ప్రయాణాలు చేసినప్పుడు ఎన్నో వూళ్ళలో ఆగుతుంటాయి కదా! ఆగినచోట్ల — వాము జంతికలూ, చేగోడీలూ, కరకజ్జం, బటాణీలూ, అరిటిపళ్ళూ, సోడాకాయలూ,



మొక్కజొన్న పొత్తులూ — యిలాంటి వేవో అమ్ముడౌస్తాయి కాని, యిన్ని రకాలపువ్వులూ ఎక్కడా అమ్మరావు. ఈ వూళ్ళో పువ్వులు తప్పితే మరేవీ రావు అందుకే 'బుచ్చి' అంటే నాకు చాలా యిష్టం

బస్సు వెళ్ళిపోయింది. కళ్ళల్లో దుమ్ముకొట్టి పోయింది. ఒక్క క్షణం కళ్ళు మూసుకుని అలా నిలబడి పోయాను

రంగయ్యా, భార్యా నాకంటె ముందు నడుస్తున్నారు జేబులో రుమాలు తీసుకుని కళ్ళు తుడుచుకున్నాను.

''రాండి సార్,'' అంటూ రంగయ్య పిలిచాడు.

అడుగు ముందుకు వెయ్యబోయాను. తీరా చూద్దును కదా, చుట్టూ పిల్లలు ! పువ్వు లమ్ముకునే పిల్లలు ! రకరకాల పువ్వులు. రకరకాల వన్నెలు, తీరు తీరుల దండలు.

అందరూ తలొక దండా పట్టుకొని చేతులు చాచారు.

ఒక్క—క్షణం అప్రతిభుణ్ణి అయాను. రాయలవారి విజయనగరంలో విరూపాక్ష స్వామి ఆలయానికి అల్లంత అవతల ఏ పూల అంగడి వీధిలోనో నిలుచున్నానా, అనిపించింది. బహుశ ఆనాటి పుష్ప లావికలు యిలా అవతరించారేమో అని పించింది.

"ఇవి పున్నాగపూలు!"

''ఇవి కొండమల్లెలు!''

"ఇవి బొండుమల్లెలు!"

''ఇవి జాజులు!''

''ఇవి కనకాంబరాలు!''

ఒక్కొక్కరు ఒక్కొక్క తీరు దండలు చూపిస్తున్నారు. ఏవని కొంటాను? ఎన్నని కొంటాను? పోనీ కొనుక్కున్నా యివి నేనేం చేసుకుంటాను? ముచ్చటగా సిగలో ముడిచేందుకు నాఅన్న వాళ్ళెవరున్నారనీ?

నేనా వొంటిగాణ్ణి. పైగా ఆఫీసుపని మీద ఊళ్ళు తిరుగుతున్నవాణ్ణి. మనసు పడి పువ్వులు ముడిచేందుకుకూడా తీరికా? కాని ఇంతమంది ఒకసారి నన్ను వేధించుతుంటే ఏం చేసేది?

వాళ్ళల్లో ప్రతి ఒక్కరూ ఆశగా చూస్తూన్నారు. పోనీ, వాళ్ళ తృప్తి కోసమయినా తీసుకుంటే; ఏ పువ్వులని తీసుకోను? పువ్వు అనేది ఏదన్నా బాగుంటుంది. ఒక్కొక్క దాంట్లో ఒక్కొక్క అందం కనిపిస్తుంది. ఇది ఎక్కువా, అది తక్కువా అని అంత తేలికగా నిర్ణయించడం సాధ్యమా?

నా సందిగ్ధావస్థను గుర్తించినట్టున్నారు, ఎలాగా మెత్తబడతానని బ్రతిమాలడం ప్రారంభించారు. ఒక అమ్మాయి బేడ కిస్తానంటే, మరొకమ్మాయి అణన్నరకే యిస్తానంది. ఒకళ్ళ నొకళ్ళు తోసుకుంటూ ముందుకొస్తున్నారు.

నాకు మతోయినట్టయింది.

ఇంతట్లో — ఎన్నో రకాల పూలు కలిపి కట్టిన దండ ఒకటి, ఒక అమ్మాయి చేతిలో కనిపించింది. రంగు రంగుల పూలు ముద్దొస్తూ ఉన్నాయి.

ఆ అమ్మాయి బిడియ పడుతున్నట్టు దూరంగా నిలుచునిఉంది.

ఆవైపు తిరిగి, దగ్గరికి పిలిచాను.

''ఏమి టది?'' అన్నాను.

"కదంబం!'' అన్నది.

కదంబం! దండలాగే పేరూబాగుంది.

"ఎంత కిస్తావు?'' అని అడిగాను.

''మీ యిష్టమొచ్చినంత యియ్యం డియ్యా!" అన్న దాపిల్ల. అనడమేకాదు— ఆ కదంబమూ, బుట్టలో ఉన్న మరికొన్ని విడిపూలూ అన్నీ తీసి నా దోసిట్లో పోసింది.

దోసిట పట్టినన్నిపూలు! రకరకాల పూలు, రంగురంగుల పూలు, ఒక్కొక్క పువ్వుది ఒక్కొక్కతీరు వాసన. జీవితంలో సున్నితమైన అభిరుచులకూ, సున్నితమైన వాసనలకూ ఎదురుచూసే

నారు. ఆ పుష్పలావిక కదంబం తో 'పూలంగిసేవ' చేసినట్లే అనిపించింది.

అయినా—"ఇన్నిపూలు నే నేం చేసు కోను?" అని అడిగాను.

ఆ పుష్పలావిక ఏమంటుందో నని ఆసక్తిగా చూశాను, కాని ఆమె ఏమీ అనలేదు. ముఖం కొద్దిగా పక్కకి వొంచి, తనలో తను నవ్వుకుంది. కదంబం సొగసు ఒక ఎత్తూ, ఆ నవ్వు ఒకటీ ఒక ఎత్తూ!

"అర్ధణా కిస్తావా?" అన్నాను.

అందరూ ఒక్కసారి కిలకిలా నవ్వారు. మా పుష్పలావిక చెయ్యి అడ్డం పెట్టుకుని నవ్వింది.

"నేను బీదవాణ్ణి! యింతకంటె యిచ్చుకోలేను మరి!" అని—అర్ధ రూపాయి తీసి చేతులో పెట్టాను. ఒక కదంబానికే అంత యిస్తున్నా నంటే ఆ అమ్మాయే నమ్మలేనట్టు చూసింది. చుట్టూఉన్నవాళ్లు ఆశ్చర్యపోయారు.

ఆ అమ్మాయికి నేను అర్ధ రూపాయి యివ్వడంతో, యింకా ఒకళ్ళిద్దరు బుట్టలో పువ్వు లన్నీ తీసివ్వబోయారు.

"మీరు చాలా మంచివాళ్లు కాని, ఉన్నవి చాలు!" అని చెప్పి బయట పడ్డాను.

రంగయ్యా, భార్యా నాకోసం ఎదురు చూస్తున్నారు. వాళ్ళని కలుసుకోవడం కోసం తొందరగా అడుగు లేస్తున్నాను.

"ఈ అయ్య శానా మంచాయన!" అంటూ వెనకాల వాళ్లు అనటం వినిపించింది.

"కదంబం కొన్నారా సార్?" అన్నాడు రంగయ్య.

"ఔను, కానే వరకూ వాళ్లు వొద ల్లేదు!" అన్నాను.

"ఈ పిల్ల లందరూ యింతే సార్!" అన్నాడు.

మే మిలా మాట్లాడుకుంటూ ఉండ గానే, మా పుష్పలావిక పరుగెత్తుకుంటూ అక్కడికి రావడం చూశాను.

"ఇదుగో, మీ చెల్లె లొస్తున్నదే!" అంటూ భార్యకి చూపించాడు రంగయ్య.

ఆ అమ్మాయి వచ్చింది. రంగయ్య భార్యని పలకరించింది.

"ఏం దక్కా! పెండ్లికెల్లొస్తున్నారా?"

"అవును. మీ రందరుకూడా వస్తా రనుకున్నాం. అమ్మ, అయ్య అంతా బాగున్నారా?"

"బాగున్నా రక్కా!" అని, నా వైపు చూసి నవ్వింది.

"ఈ అమ్మాయి మీ చెల్లెలా?" అని అడిగాను.

"మా పిన్నమ్మ కూతురు! ఈవూరే యిాళ్ళది. పువ్వు లమ్ముకుంటది!"

ఇవిగో, ఈ పువ్వు లన్నీ మీ చెల్లెలే నా దోసిట్లో గుమ్మరించింది!" అన్నాను.

ఇద్దరూ నవ్వారు.

"ఈ అయ్య మంచాయనక్కా! ఒక్క కదంబానికి అర్ధరూపాయి యిచ్చారు," అన్న దాపిల్ల.

"తెలియనాయన. ఆయ విస్తేను వ్వెట్లాతీసుకున్నావు?" అని అడిగాడు రంగయ్య.

''పెద్దాయిన యిస్తే తీసుకోకుంటే ఎట్లక్కా?'' అన్న దామె బిక్కమొహం పెట్టి.

రంగయ్య నవ్వాడు. "ఇంకెప్పు డట్ల తీసుకోకు!'' అన్నాడు.

"అందరిదగ్గిరనేనెందుకుతీస్తుంటా?" అని రెట్టించిం దాపిల్ల.

"బాగన్నావు పెన్నా!'' అన్నది రంగయ్యభార్య.

పెన్న!

ఆ పిల్ల పేరు పెన్న!

అక్కా చెల్లె ళ్ళిద్దరూ మాట్లాడు కుంటూఉండగా నేనూ, రంగయ్యాప్రక్క హోటలుకు పోయి కాస్త టిఫినూ, కాఫీ తీసుకున్నాం. ఇద్దరం బయటికి వస్తూఉంటే రంగయ్య అడిగాడు—

"ఏమి సార్! మీరు నెల్లూరు పోతారా?"

"అదే ఆలోచిస్తున్నాను రంగయ్యా! కాని యీ వూళ్లో నాకు రెండు మూడు రోజుల పని ఉంది. ఇక్కడ ఉండేందుకు వసతి దొరికితే పని పూర్తి చేసుకునే వెళ్తాను?"

"ఉండండి సార్! దాని కేంది!"

"ఇక్కడ హోటళ్ళలో ఏమన్నా గదులు దొరుకుతాయా?"

"గదు లెక్కడ సార్! అన్నీ చిన్న హోటళ్ళాయె! పొద్దుటివరకూ ఆగితే, పంచాయతి బంగ్లాలో గది దొరుకు తుంది!"

"మరి యీ రాత్రికి? ఆఫీసు రికార్డూ అదీ ఉంది. ఎక్కడ పెట్టేది?"

"మా యిల్లు యిక్కడికి దగ్గరే నయ్యా!'' అన్నది పెన్న.

"ఈ సారు మీ గుడిసెలో ఉంటా రేందే?"అన్నాడు రంగయ్య.

''నాకు అటువంటి అభ్యంతర మేమీ లేదు. కాని వాళ్ళని యిబ్బంది పెట్టడం బాగుండదు. సామాను దాచుకునేందుకు చోటు చూపించు చాలు. యీ పూటకి ఏ అరుగుమీదన్నా పడుకోవచ్చు.'' అన్నాను.

"అదేంది సార్! యాడనో అరుగు మీద పండడ మేంది? నా మాటిని, మా వాళ్ళింటికి రండి చెప్తా! మీ కంతా బాగ చేయిస్త,'' అన్నాడు రంగయ్య.

ఊరుకాని వూళ్లో వీళ్ళే బంధువుల్లా ఆదరిస్తూఉంటే నేను కాదనటం ఏం బాగుంటుంది? వాళ్లతోటే బయలుదేరాను.

ఊరుకు దాదాపు చివర, యానాది వాళ్ళగుడిసెలు ఉన్నాయి. వాటికి యివతలవైపు ఒక సందులో మారుమూల తాటాకుగుడిసె ఒకటి ఉంది. ఆ వాకిట్లో అడుగుపెట్టాము.


పెన్న లోపలికి ఉరికి, అక్కా, బావా వచ్చారని చెప్పింది. పెన్నతండ్రీ, తల్లీ బయటికివచ్చి పలకరించారు.

వాళ్ళు మాట్లాడుతూ ఉండగా, ఆ అమ్మాయి కూర్చునేందుకు నుక్కి మంచం ఒకటి తెచ్చి వేసింది. దివ్వెసోడ తెచ్చి గుమ్మంలో పెట్టింది.

కొంచెంసేపు కూర్చున్న తరువాత రంగయ్యా, పెళ్ళామూ బయలుదేరారు. ఆ పూటకి ఉండమన్నా వినలేదు. అన్నం తిని వెళ్ళమన్నారు. "అబ్బే, తొందరగానే వెళ్ళిపోతాం" అన్నాడు రంగయ్య.

వాళ్ళు వెళ్ళిపోయిన తరువాత ఒక పళ్ళెంలో పళ్ళూ, పాలూ తీసుకువచ్చింది పెన్న. అంతకుముందే హోటల్లో టిఫినూ, కాఫీ తీసుకరావడంవల్ల అస్సలు ఆకలి వెయ్యటంలేదు. అయినా వాళ్ళ ఆదరం త్రోసిపుచ్చలేక తీసుకోక తప్పింది కాదు.

ఆ మంచంమీదే పక్క పరుచుకుని పడుకున్నాను. పెన్నా, ఆమె తండ్రీ గుమ్మంలో కూర్చుని కబుర్లు చెబుతున్నారు. వాళ్ళతో మాట్లాడుతునే ఉన్నాను. ఎప్పుడు నిద్ర పట్టిందో నాకే తెలియదు.



ఒక రాత్రివేళ మెళుకువ వచ్చింది. మొహం మీద దోమలు ముసి రేస్తు న్నాయి. అక్కడ దక్కడ నల్లులు అంటబొడుస్తునాయి. మంచం నులక ఎగుళ్ల దిగుళ్లగా ఉంది.

నిశ్శబ్దంలో ఊరు నిద్రిస్తూ ఉంది. అప్పుడప్పుడు ఒకటి రెండు కుక్కల మొరుగులు వినిపిస్తున్నాయి. కొండ మీది చుక్కలు లెక్కెడుతూ మాగన్నుగా పడుకునిఉన్నాను.

జీవితంలో ఇటువంటి అనుభవాలు ఎంత చిత్రమైనవి! ఏవో పనులమీద యిలా ఊళ్ళు తిరగడం, ఒకచోట తినడం, మరొకచోట పడుకోవడం, రక రకాల వ్యక్తులతో పరిచయాలు చేసు కోవడం, రకరకాల అనుభూతులు గుండెల్లో ప్రోదిచేసుకోవడం – యివన్నీ తలుచుకున్నప్పుడు జీవితం ఎంత విశాల మయిందో అనిపిస్తుంది. ఇన్ని తీరుల అనుభూతులుపొందడంవల్ల ఈజీవితంలో నేను పడేశ్రమ ఏదీ వృధా కాదనిపిస్తోంది.

మళ్ళీ కళ్ళు మూతలు పడుతున్నాయి. రంగయ్యా, భార్యా కనిపించారు. అతను ఏదో అంటున్నాడు. ఆమె ఎందుకో నవ్వుతున్నది. ఆమె చేతిలో ముల్లె విప్పింది. అందులో అన్నీ పువ్వులే. ఆ పువ్వు లన్నీ ఆమె తలమీద గుమ్మ రించాడు రంగయ్య! ఎంత అందమైన ముచ్చట!

వాళ్లిద్దరూ, ఒకరినొకరువాటేసుకుని అలా వెళ్ళిపోతున్నారు. పువ్వు లన్నీ అక్కడే కుప్పలా పడిఉన్నాయి. ఆ కుప్ప నడుమనుంచి పెన్న పైకి లేచింది. ఆమె నవ్వుతూ యిటే వస్తున్నది. ఆమె మెడలో పొడవాటి కదంబం! చెక్కిట చుక్క, నొసట కుంకుమా ఎర్రగా వెలుగు తున్నాయి. తలకు ఎత్తయిన పూల కిరీటం! ఆమె అడుగు తీసి అడుగు వేస్తూంటే మట్టిలో మందారాలు విచ్చు కుంటున్నాయి.

పెన్న యీ వైపే వస్తున్నది. నా వైపే వస్తున్నది! యౌవనోదయంలో మొట్టమొదటిసారిగా కలిగిన అనుభూ తిలా ఉంది. హృదయం నిండిపోయింది.

కల చెదిరిపోయింది. కళ్ళు విచ్చు కున్నాయి.

సరిగా అప్పుడే బయట దడి తలుపు కదిలిన చప్పు డయింది. ఎవరో యిద్దరు లోపలికి రావడం గమనించాను. వాళ్ళు ఏం చేస్తారో చూద్దా మని కదలకుండా అలానే పడుకునిఉన్నాను. వాళ్ళు నా వైపు చూడకుండానే గుడిసె వెనక తట్టుకు వెళ్తున్నారు. నాకు చాలా ఆశ్చ ర్యంగా ఉంది. ఎవళ్లో వీళ్ళు? ఎందు కొచ్చారో, యీ అర్ధరాత్రివేళ? అలవా టయిన చోటికి వచ్చినట్టు యీ చొరవ ఏమిటో? ఏం అర్థంకాలేదు. నేనుకూడ లేచి, ఆవైపుకి మెల్లగా వెళ్ళాను.

వీళ్ళతో బాటు యింకో అయిదారు గురు అక్కడ కూర్చున్నారు. గుప్పున సారాకంపు కొట్టింది! పెన్ను అటూ యిటూ ఒకటి రెండుసార్లు తిరగడం కనిపించింది. వాళ్ళందరిముందూ ముంత లున్నాయి. సంగతి అంతా అర్థమైంది. తిరిగివచ్చి పడుకున్నాను. కాని నిద్ర తేలిపోయింది. రకరకాల ఆలోచనలు బుర్రలో మెదులుతున్నాయి.

'వాళ్ళని చూడకపోయినా బాగుండి పోయేది!' అనుకున్నాను.

ఎంతో అందంగా ఊహించుకున్న పుష్పలావిక ఈ అర్థరాత్రివేళదొంగసారా అమ్ముతోంది! ఆవురావురు మంటూ చూస్తున్న తాగుబోతు వాళ్ళ మధ్య చనువుగా తిరుగుతోంది!

అవును, ఆ అమ్మాయిగురించి నేను యింతగా ఆలోచించడ మేమిటీ? నా కే మవసరం వుందీ?

ఏమీ లేదు. ఉండాలన్న భ్రమకూడా ఏదీలేదు. అయినా, నాకు తెలియకుండానే నాలో, ఏమూలో కొద్దిపాటి అసూయ కలిగి ఉండాలి. లేకపోతే యింతగా నిరుత్సాహం కలిగేదికాదు.

దొంగసారా వ్యాపారం చేస్తున్నవాళ్ళ ఇంట్లో నేను! కలలోకూడా ఊహించలేని నిజ మిది!

ప్రపంచంలో చాలామంది చట్టవిరుద్ధ మైన పనులు చేస్తూనేవుంటారు. చట్టా లనేవి 'మంది'కి కాని 'మనిషి'కి కాదని ఆ పరిస్థిలో ఎవరికి వా రనుకుంటారు. ఆ మందిలో తమ్ముతాము మినహాయించు కుంటారు. తమకు అనుకూలంగా ఏదో సాకుచెప్పుకుని సరిపెట్టుకుంటారు. ఇంక గత్యంతరంలేకనే అలా చేస్తున్నా మని సమాధాన పడతారు. ఇది నేరస్తు లందరి మనస్సుల్లోనూ అంత రాంత రాలలో కలిగే అభిప్రాయం. ఒక దొంగ, ఒక వ్యభిచారి, ఒక తాగుబోతు. ఒక చీకటి వ్యాపారస్తుడు, ఒక లంచగొండి, ఎవడికివాడు ఒక అభిప్రాయం ఏర్పరచు కుని దానికి అనుగుణంగా అవకాశం కలగజేసుకుంటాడు. లేదా వచ్చినదాన్ని వినియోగపరచుకుంటా నంటాడు. అయితే, స్వలాభదృష్టి, సుఖేచ్ఛ అనేవి ప్రతి ఒక్కరికీ ఉంటా యన్నంతమాత్రాన విశృంఖలత్వాన్ని ఎవ్వరూ ఒప్పుకోరు. తమదాకా వచ్చినప్పుడు వాళ్ళే స్వరక్షణ కోసం మళ్ళీ చట్టాలు చూపిస్తారు.

ఎలెక్సిస్ కారెల్ అనే ఆయన, 'మాన్ ది అన్ నోన్' అన్నాడు. అందులో నిజం యిప్పుడు బోధపడింది.

అయినా మంచీ చెడూ, నీతీ అవినీతీ అనేవాటికి ప్రపంచంలో యింతవరకూ హద్దు చూపించినవా దెవడు? చూపించ గలిగేఉంటే, ప్రపంచంలో ప్రతి ఒక్కరి మొహం మీదా, నేరస్తు డన్న ముద్ర ఏదోఒక సందర్భంలో వెయ్యకతప్పదు. అందుకని గడుసువా ళ్ళంతా మన కెందు



కన్నట్టు చూసీ చూడనట్టు తప్పుకుంటారు.

కాస్సేపట్లో ఒక్కొక్కళ్ళే తిరిగి పోవడం గమనించాను. అంతా వెళ్ళిపోయాక, పెన్నతండ్రి వచ్చి గదిలి తలుపు గట్టిగా కట్టి వెళ్ళిపోయాడు.

దోమలు పీకేస్తున్నాయి. సరిగా గంట సేపటినుంచీ కంటిమీద కునుకు లేదు.

పొద్దున్నే పంచాయతీ బంగళాలో గది తీసుకోవాలి. రెండుమూడు రోజుల్లో పని పూర్తి చేసుకోవాలి. అయిపోయిన వెంటనే నెల్లూరు బస్సెక్కాలి.

ఇల్లువిడిచి రెండునెలలు కావస్తోంది. ఏమిటో, దిగులుగా ఉంది. ఇంతమంది జనం మధ్య వొంటరిగాణ్ణి నేనొక్కణ్ణే అనిపిస్తోంది. జీవితంలో యింతకంటె కఠిన మైన శిక్ష ఎవడూ అనుభవించ డనిపిస్తుంది. తెలిసిన మొహం ఒక్కటీ కనిపించదు. నాకు యిష్టులూ, కావలసిన వాళ్ళూ, ఒకపూటకూడా నన్ను చూడకుండా ఉండలేనివాళ్ళూ ఎందరో ఉండగా 'అగమ్మకాకి' లా యిలా ఊళ్ళుబట్టి తిరగడంకంటె దురవస్థ మరొకటి లేదనిపించింది. ఒక వినోదమూ, ఉత్సాహమూ యిచ్చేతోడు అసలే లేదు.

"గురువుగారూ! మీలాంటి వాళ్ళకి యీ టూరింగులు పడవుసార్!" అంటూ



ఉంటాడు మా ఆంజనేయులు - అంటే, ఆఫీసులో నా అసిస్టెంటు.

ఔను. నిజమే అనిపిస్తుం దిప్పుడు.

కళ్ళు మూతలు పడుతున్నాయి.

ఎక్కడా అలికిడి లేదు.

పెన్న మెల్లిగా నా మంచం దగ్గిరికి వచ్చింది.

కనురెప్పలు తెరుచుకోలేనంత బరువెక్కాయి.

ఒక్క క్షణం అలానే నిలబడి చూసింది. నేను కదలలేదు.

పెన్న మెల్లిగా వెళ్ళిపోయింది.

ఎప్పుడు నిద్రపట్టిందో తెలియదు.

తెలతెలవారుతూ ఉండగా మెళుకువ వచ్చింది. నిన్న తీసుకున్న కదంబం, నా తలదగ్గిర నలిగిపడిఉంది!

అది అక్కడికి ఎలా వచ్చిందో గుర్తులేదు. ఒకవేళ నేనే అక్కడ పెట్టుకున్నానేమో? ఏమో, నా కేమీ జ్ఞాపకం లేదు!

లేచి వొళ్ళు విరుచుకున్నాను.

పెన్న తండ్రి వచ్చా డక్కడికి.

"బాగా నిద్రపట్టిందా అయ్యా?" అని అడిగాడు.

"పట్టింది!" అన్నాను.

ఆ అమ్మాయి, మొహం కడుక్కోనేందుకు నీళ్ళూ, వేపపుల్లా అక్కడ పెట్టివెళ్ళింది.

మొహం కడుక్కుని, కాఫీ తాగడానికి హోటలికి వెళ్ళాను.

తిరిగి వచ్చేసరికి, పెన్న వాకిట్లో కూర్చుని దండ కడుతోంది. ఎదురుగా బుట్టెడు పువ్వులు కుప్పగా పోసుకుంది.

పెన్న నవ్వింది.

నేనూ నవ్వాను. ఆ నవ్వు మన స్ఫూర్తిగా వచ్చింది కాదు.

"పంచాయతీ బంగళాలో గది తీసుకున్నాను; నా సామాను తెచ్చిపెట్టు;" అన్నాను.

"ఎల్లిపోతారా అయ్యా ?" అన్నది, కళ్ళు పెద్దవి చేసి.

"ఔను, ఇంకా ఎన్నా ళ్ళుండమంటా విక్కడ ?"

"మీలాటి మారాజులు మా గుడిసెల్లో ఎట్లుంటార్లెండి !" అన్నది.

పెన్నకు యిన్ని మాటలు వచ్చునని నేను ఊహించలేదు.

"రాత్రి అంతా లేనూ ?"

"విదరోయారు కదా !"

"లేదు !" అన్నాను స్పష్టంగా.

పెన్న మొహం వెలవెలబోయింది.

"అదే పట్టింది !"

"అంతేనా !" అని నవ్వింది.

ఇంతలోకే ఆమె తండ్రి వచ్చాడు. సామాను తీసుకుని నా వెంట వచ్చాడు.

వస్తూంటే పెన్న ఆపి —

"కదంబం అయ్యా ! ఇప్పుదే కట్టాను, తీసుకోండి !" అంటూ అందివ్వబోయింది.

"ఇప్పు దొద్దు ! మగవాణ్ణి నే నేం చేసుకుంటాను. నువ్వు పెట్టుకో !" అని, ఒక రూపాయి బహుమతిగా యిచ్చి బయటికి నడిచాను.

ఆవేళ్ళ మధ్యాహ్నం మా ఆంజనేయులు హఠాత్తుగా వచ్చిపడ్డాడు, నన్ను వెతుక్కుంటూ.

"ఏవిఁటీ రాక ?" అన్నాను,

"ఏముంది గురువుగారూ! మన టూరు ప్రోగ్రాం కాన్సిల్ అయిపోయింది. సాధ్యమైనంత తొందరలో యిక్కడ పని పూర్తి చేసుకుని మీతో హైదరాబాదు వచ్చెయ్యమని ఆఫీసరుగారు నాకు వెంకటగిరికి టెలిగ్రాం యిచ్చారు. బతుకు జీవుడా అనుకుని యిలా వొచ్చిపడ్డాను. ఈ మధ్య కంపెనీలేక టూర్లో చాలా అవస్థపడ్డాను. డబ్బుసంగతి సరేసరి, బొటాబొటీగా సరిపోయింది. ఇక్కడ మిమ్మల్ని చూడ్డంతోటే ప్రాణం లేచొచ్చింది!" అంటూ ఒక్కబిగిని ఉపన్యాసం యిచ్చాడు.

"వెరీగుడ్ ! మంచిన్యూసు తెచ్చావు: లేకపోతే యింకో నెల్లాళ్ళపాటు మన కీ అవస్థలు తప్పేవికావు !

"ఆంజనేయులంటే ఏవఁనుకున్నారు సార్ మరి ! " అంటూ మాంఛిపోజులో మీసం దువ్వుకున్నాడు.

"సరేకానీ, లేచి తొందరగా స్నానం చెయ్యి. కాస్త టిఫిన్ తీసుకుని ఊళ్లో పడదాం."




“ఆ పిల్లిపిల్ల ఏమంటుంది?...అట్లా! మరి పాడిఆవు ఏం చెపుతుంది? అది... ఆఁ చిట్టిబాబు ఏం చెపుతాడు... కరెక్ట్.”

---

“జో హుకుం!” అని, హోల్డాలు విప్పుకుంటూ అర్జంటుగా వెనక్కి తిరిగాడు.

“ఏవిఁ” టన్నాను.

“మీ రెప్పు డొచ్చా రిక్కడికి?”

“నిన్న!”

“అరెరే! ఒకరోజల్లా వేస్టయి పోయిం దన్నమాట! స్టిల్ దేరార్ త్రీడేస్ మోర్! ఊరు చాలా బాగుంది.”

“అప్పుడే ఊ రేం చూశావ్?” అని అడిగాను.

“దాని కేముంది సార్! ఫస్ట్ యింప్రెషన్ యీజ్ ది బెస్ట్ యింప్రెషన్ అన్నాడు శాస్త్రకారుడు. ఊళ్ళో అడుగు పెట్టడంతోనే ఇంప్రెషన్ పడిపోయింది!”

“ఏమని?”

“మా గిరీశం బాబాయి అన్నట్టు, మాంచి ఘీ, కమ్మని గేదె పెరుగూ, దంపుడు బియ్యపు అన్నం – లాస్ట్ బట్ నాట్ ది లీస్ట్ – ఫ్లవర్ గరల్స్! – కొండొక చోగ్రాస్గరల్స్! – అందుకే కంట్రీలైఫో కంట్రీలైఫో అని దేవుళ్ళాడతారు మన పొయట్సంతా! మాంచి యీస్థటిక్ సెన్సు ఉన్నవా డెప్పుడూ విలేజిలైఫే ప్రిఫరు చేస్తా డనుకోండి; ఒకటేలెక్ఖ!”

“ఇదుగో ఆంజనేయులూ, కాస్త నీ వాగుడు కట్టిపెడతావా?”

"దాందేముందిసార్! ఐ కెన్ ఆల్వేజ్ ఒబ్లైజ్ యూ! వాటీజ్ దేర్!"

* * *

ఆవేళ సాయంత్రం నేను గదిలో కూర్చుని రిపోర్టు రాసుకుంటూ ఉండగా ఒకసారి అలా బయటికి వెళ్లొస్తానని బయలుదేరాడు ఆంజనేయులు.

చీకటి పడింది. నా రిపోర్టు యింకా పూర్తి కాలేదు. ఆంజనేయులు యింకా గదికి రాలేదు. గంటల తరబడి రాసుకుంటూ కూర్చోవడంతో వొళ్ళు నొప్పులు చేసింది. కాస్సేపు అలా తిరిగొచ్చి భోజనం చేద్దామని బయలుదేరాను.

సందుమలుపు తిరిగేసరికి — ఆంజనేయులు ఎదురుపడ్డాడు.

"గురువుగారూ! అర్జంటుగా ఓ అయిదు రూపాయిల నోటుంటే యిలా పడెయ్యండి!" అని అడిగాడు.

"ఏం? ఎందు" కన్నాను.

"మనదగ్గర కరెన్సీ నిల్లుకుంది;"

"ఏమి టా అర్జెన్సీ?" అన్నాను.

"అంతా తరవాత చెప్తాసార్! ముందిలా పడెయ్యండి; అర్జంట్!"

వాడి ధోరణి చూస్తే నాకేదో అనుమానం కలిగింది. అతను యీ వూరొచ్చినప్పట్నుంచీ సిగరెట్లఖర్చు దగ్గర్నుంచి నేనే పెడుతున్నాను. అర్జంటుగా అయిదు రూపాయలు ఎందు కవసరమయిందో అర్థంకాలేదు.

"లేదు!" అన్నాను.

"చంపేశారు సార్! ఐ లాస్ట్ ఏ గోల్డెన్ అపర్చ్యునిటీ! పోనీ, యిఫ్యూ డోన్ట్ మైండ్ ఒక్కసారి రూమ్‌కి రాకూడదూ?"

"వీల్లేదు! ముందు భోజనానికి పద!" అన్నాను ఖండితంగా.

అంతే, ఆంజనేయులు మళ్ళీ ఏం మాట్లాడలేదు. కిక్కురుమనకుండా వెంట వచ్చాడు.

ఆ మర్నాడు ఊళ్ళోపని పూర్తి చేసుకుని రిపోర్టురాయడాని క్కూచున్నాను. ఆంజనేయులు కిమిన్నాస్తి — మన్ను తిన్న పాములా పడున్నాడు.

నేను డబ్బు యివ్వనన్నందుకు చిన్నబుచ్చుకున్న ట్టున్నాడు. వెనకటంత ఉత్సాహంగా మాట్లాట్టంలేదు. అతన్ని అలా కూర్చోనివ్వటం యిష్టంలేక, నా రిపోర్టు కొంత సాపు రాసిపెట్టమన్నాను. మాట్లాడకుండా కూర్చుని రాయడం ప్రారంభించాడు.

ఆ వేళ సాయంత్రానికి రిపోర్టు పూర్తి అయింది.

"రాత్రికి మనం నెల్లూరు చేరుకోవాలి!" అన్నాను.

"ఇవేళేనా?" అన్నాడు ఆంజనేయులు.

"అవును. నువ్వు రావడంవల్ల పని తొందరగానే పూర్తి చేశాను."

"పోనీ యీ పూట రెస్టు తీసుకోకూడదూ?"

"పని అయిపోయింతరవాత యింకా యిక్కడెందుకు?"

"మీరంతా అదో తరహా సార్!" అన్నాడు.

నే నేం మాట్లాడలేదు. సామాను సరుకోవడం ప్రారంభించాను.

సాయంత్రం బస్సు వచ్చింది. ఇద్దరికీ టిక్కెట్లు కోయించాను. ఆంజనేయులు నా ఎదుటిసీట్లో కూర్చున్నాడు. మాటా మంతీ లేదు. మొహం ముడుచుకు నున్నాడు.

పువ్వు లమ్మే పిల్లలు బస్సు చుట్టూ మూగారు. ఒక అమ్మాయి ఆంజనేయులు దగ్గిరికి వచ్చి దండ అందించింది. అతను తీసుకోలేదు. కొనమని బతిమాలింది. కసిరికొట్టాడు. అతని ధోరణి అలా ఎందుకు మారిందో నాకు అర్థం కాలేదు.

బస్సు బయలుదేరబోతూ ఉన్నది. దూరాన్నించ మా పుష్పలావిక— పెన్న - కదంబం తీసుకురావడం గమనించాను

పెన్న — కదంబం!"

పెన్న బస్సుదగ్గిరికి వచ్చింది.

పోతున్నారా అయ్యా?" అని అడిగింది

అవును," అన్నాను.

"మళ్లా మా వూరు రారా?"

"ఏమో! చెప్పలేను," అన్నాను.

పెన్న నిరుత్సాహపడిపోయింది.

"కదంబం తీసుకోరా అయ్యా?" అంటూ జాలిగా అడిగింది.

"నే నేం చేసుకుంటాను పెన్నా! ఈ అయ్య కియ్యి!" అని ఆంజనేయుల్ని చూపించాను.

పెన్న అతని వైపు చూసింది, ఒక్క క్షణం. ఆశ్చర్యపోతూ అలానే చూసింది. ఆంజనేయులు మొహం తప్పించుకున్నాడు.

"ఈ అయ్యకా?"

"ఔను."

"ఈ అయ్య మంచాయన కాదయ్యా! మీరే తీసుకోండి!" అంటూ కదంబం నా వొళ్ళోకి విసిరింది, పెన్న.

బస్సు కదులుతూ ఉంది. తొందరగా జేబులోంచి డబ్బులు తీసి, ఆమె బుట్టలో వేశాను.

బస్సు నడుస్తోంది.

పెన్న మా వాడివైపు చురచురా చుస్తోంది.

ఆంజనేయులు వారపత్రిక ముఖానికి అడ్డం పెట్టుకున్నాడు.

పెన్న చిన్నగా వెళ్ళిపోయింది.

నా దోసిట్లో కదంబం!